కొత్త పనివాళ్లను పెట్టుకుని చాలా హింసిస్తున్నారట. జీతాలివ్వరట. సరిగ్గా పనిచేయటం లేదని ఓ కుర్రాణ్ణి ఒక పార్టనర్ కాల్చి వాత పెట్టాడట. ఇదంతా విని 'నా దగ్గిర ఇన్నాళ్లూ వీళ్లు నేర్చుకున్నది ఇదా? కార్మికుడు యజమానైతే సాటి కార్మికుడికి మేలు చేస్తాడనుకున్నాను కానీ ఈ విధంగా శ్రమ దోపిడీ చేస్తాడా?' అని నాన్న ఎంతో బాధపడి బీపీ తెచ్చుకున్నాట్ట.

"నా విషయంలో నాన్న ఎంత కుమిలిపోతున్నాడో వేరే చెప్పక్కర్లేదు. నేను సుఖాలు మరిగి, కాపిటలిస్టుతత్వం వంటబట్టించుకొంటున్నానని ఎంతో బాధపడతాడు. అందరూ ఆయనలాగే వుండరన్న విషయం ఆయనకూ తెలుసనుకో. అయినా తన కొడుకూ, కొడుకులా చూసుకున్న పనివాళ్లూ ఇలా తయారవ్వడమే ఆయన భరించలేకపోయాడు.

పులిమీద పుట్రలా రష్యా విచ్ఛిత్తి వార్త ఒకటి – మనదేశంలో ఇన్ని జాతులున్నా విడిపోకుండా వున్నాం కదా. అర్వై యేళ్లు కార్మిక నియంతృత్వంలో కలిసి మెలిసి వున్నా సోవియట్ యూనియన్‌లో వున్న వివిధ జాతులవాళ్లు ఏకం కాలేకపోగా ఒకళ్లతో మరొకరు పోట్లాడ్డం నాన్నకు జీర్ణం కాలేదు.

ఇన్నాళ్లూ నమ్ముకున్న ఊతకర్ర విరిగిపోయినట్టు, దీపస్తంభం కూలిపోయినట్టూ అనిపించింది. చదువుకుని ప్రపంచం పోకడలు గమనిస్తున్న కామ్రేడ్లు ఎప్పటికో ఇలా జరగబోతుందని ఊహించి మానసికంగా సిద్ధపడి వుంటారు. మా నాన్నలాటి మూఢభక్తులదే బాధంతా. వాస్తవాల్ని తట్టుకోలేక మంచం పట్టాడు."

ఈసారి ఊరెళ్లినప్పుడు చంద్రయ్యను తప్పకుండా చూడాలనుకున్నాను. ఏడాదిన్నర దాకా వీలుపడలేదు. ఈలోపున ఓ మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగానికి అరుణ్ దరఖాస్తు పడేశాడు. నన్ను సిఫార్సు చేయమన్నాడు.

దాని ఛైర్మన్ హూవర్ నాకు బాగా తెలుసు. మా కంపెనీ హెడ్ క్వార్టర్సు కూడా న్యూయార్కులోనే వుంది కాబట్టి ఆర్నెల్లకోసారి ఆయన్ని అక్కడ కలుస్తూంటాను. హూవర్‌కి భారతదేశం అంటే మహా ఆసక్తి. ఇండియా వచ్చి మన నదులూ, పల్లెటూళ్లూ చూస్తానంటూండేవాడు. వచ్చే నెలలో ఇండియాకు వచ్చినప్పుడు ఉద్యోగం విషయం మాట్లాడతానని అరుణ్‌కి మాట ఇచ్చాను.

వేరే ఎక్కడికో ఎందుకని హూవర్‌ని మా ఊరికే తీసుకెళ్లాను. ఆయన్ని హోటల్లో బస చేయించి చంద్రయ్యను చూడబోయాను. మనిషి చాలా పాడయ్యాడు. మాట కూడా ముద్దగా వస్తోంది. అరుణ్ ఉద్యోగ ప్రయత్న విషయం అతనికి చెప్పడం భావ్యమనిపించింది. తనకు చెప్పకుండా అమెరికన్ కంపెనీలో తన కొడుకుని చేర్చినందుకు నన్ను తప్పు పట్టవచ్చు!

అందువల్ల బెదురుతూనే 'అరుణ్ చెప్పాడో, లేదో' అంటూ మొత్తం విషయమంతా చెప్పాను.

చంద్రయ్య మొహం మ్లానయింది. "మీరు అమెరికా వోడికి ఊడిగం సేయడమే కాకుండా మావోడినీ దింపుతున్నారన్నమాట!" అన్నాడు కటువుగా.

"చంద్రయ్యా, కాపిటలిజమ్ కాపిటలిజమ్‌లా లేదు. కమ్యూనిజం కమ్యూనిజంలా లేదు. అన్నీ కలగాపులగమైపోయి కొత్త విధానానికి దారి తీస్తున్నాం మనం.." అంటూ ఏదో చెప్పబోయాను నేను.

"ఏటీ బాబూ కొత్త విధానం? సోడాకాయలూ, వేరుశెనక్కాయలూ, బఠాణీలూ రంగురంగుల పాకెట్లలో పెట్టి మనలాటి బీదదేశాల్ని దోసుకుతినడమా? వాళ్ల టెక్నాలజీ మనకు నేర్పుతారా బాబూ! వాళ్ల బూట్లూ, బాడీలూ లేకపోతే మనకు తెల్లారదా?" అంటూ ఆవేశపడ్డాడు చంద్రయ్య.

"ఊరుకో, ఊరుకో" అంటూ వారించాను.

"బాబూ, నే నొక్కటి చెప్తున్నాను వినండి. కమ్యూనిస్టోడంటే అమెరికావోడికి ఎప్పటికీ హడలే. ఈ రోజు రష్యా చితికిపోవచ్చు. కానీ కమ్యూనిస్టు భావాలు వంటబట్టినవాడన్నా, వాడి తాలూకు వాళ్లన్నా ఒణికిసస్తారు అమెరికానాకొడుకులు. మీరు సిఫార్సు చేసినా సరే, వాళ్లు వాకబు చేయకమానరు. అరుణ్‌బాబు ఓ కమ్యూనిస్టు కొడుకని తెలియగానే బెదిరిపోయి ఉద్యోగం ఇవ్వరు. అంచాత మా అబ్బాయి అమెరికా వాడి తొత్తు కావడం కల్ల" అని తెగేసి చెప్పాడు దర్పంగా.

